ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ పోలీసుల మెరుపు దాడి..

1.961 కేజీల గంజాయి స్వాధీనం

- మంగళ్‌హాట్‌లో సత్తా కిషోర్ అరెస్ట్..

- భార్య స్నేహ సింగ్ పరారీ.. - మరో కేసులో ధర్మేష్ సింగ్ కూడా అరెస్ట్



తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 6 (విజన్ ఆంధ్ర): గంజాయి మాఫియాపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. పక్కా సమాచారంతో మంగళ్‌హాట్‌లో మెరుపు దాడి నిర్వహించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడి స్థానికంగా సంచలనం సృష్టించింది.

ధూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మంగళ్‌హాట్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న నమ్మకమైన సమాచారం అందడంతో ధూల్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. గురువారం మధ్యాహ్నం మంగళ్‌హాట్‌లోని ఓ ఇంటిపై దాడి చేయగా, అక్కడ 1.961 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సత్తా కిషోర్ అరెస్ట్

ఈ కేసులో ప్రధాన నిందితుడైన కిషోర్ సింగ్ ఏ సత్తా కిషోర్, తండ్రి పాపాలాల్ సింగ్, వయసు 58 సంవత్సరాలు, నివాసం మంగళ్‌హాట్‌లి ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కిషోర్ సింగ్ గత కొంతకాలంగా మంగళ్‌హాట్ ప్రాంతంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అతడి వెనుక మరెవరైనా ఉన్నారా? గంజాయి ఎక్కడి నుంచి తెస్తున్నాడు? ఎవరెవరికి సరఫరా చేస్తున్నాడు? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు.

భార్య స్నేహ సింగ్ పరారీ

ఈ కేసులో మరో కీలక నిందితురాలు స్నేహ సింగ్, భర్త కిషోర్ సింగ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దాడి సమయంలో ఆమె ఇంట్లో లేకపోవడంతో తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఆమె పాత్ర కూడా కీలకమని పోలీసులు భావిస్తున్నారు. ఆమె కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. త్వరలోనే ఆమెను కూడా అరెస్ట్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పాత కేసులో మరో నిందితుడు అరెస్ట్

ఇదే దాడిలో పోలీసులకు మరో విజయం దక్కింది. జూ= 33/2026 కేసులో చాలా కాలంగా పరారీలో ఉన్న నిందితుడు ధర్మేష్ సింగ్, తండ్రి రమేష్ సింగ్, నివాసం రహీంపురా ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని కూడా కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా పరారీలో ఉన్నారా అనే విషయంపై కూడా విచారణ కొనసాగుతోంది.

పాల్గొన్న బృందం

ఈ విజయవంతమైన దాడిలో సీఐలు ప్రవీణ్ కుమార్, వెంకన్న నేతృత్వంలో సిబ్బంది జనార్దన్ రెడ్డి, రిజ్వాన్, ప్రసాద్, రవి, సూర్య, పరమేశ్వరి, షాజహాన్ పాల్గొన్నారు. వారి సమన్వయంతో కూడిన పనితీరు వల్లే ఈ దాడి విజయవంతమైందని అధికారులు చెబుతున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

ధూల్‌పేట్, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు వరుస దాడులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. గంజాయి విక్రయాలు, రవాణాపై సమాచారం ఉన్నవారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ అధికారులు విజ్ఞప్తి చేశారు. మంగళ్‌హాట్‌లో జరిగిన ఈ దాడితో గంజాయి విక్రయదారుల్లో వణుకు పుట్టింది. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు కొనసాగుతాయని ఎక్సైజ్ శాఖ హెచ్చరించింది.

కార్మికులను కింద కూర్చోబెట్టి... కుర్చీలో దర్జాగా డిపో మేనేజర్

- సిద్దిపేటలో ఆర్టీసీ అధికారి తీరుపై తీవ్ర విమర్శలు

- కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని జేఏసీ ఆగ్రహం



తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, నవంబర్ 06: ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు వెళ్లిన జేఏసీ నాయకులు, కార్మికులను కింద కూర్చోబెట్టి, తాను మాత్రం కుర్చీలో దర్జాగా కూర్చొని మాట్లాడుతున్న సిద్దిపేట డిపో మేనేజర్ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది.

కార్మికుల సమస్యలు వినాల్సిన అధికారి, కార్మికులను కింద కూర్చోబెట్టడం ఏంటని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏం జరిగింది ?

సిద్దిపేట డిపోలో కార్మికులకు ఉన్న సమస్యలపై చర్చించేందుకు ఆర్టీసీ జేఏసీ నాయకులు డిపో మేనేజర్ వద్దకు వెళ్లారు. డ్యూటీలు, ఓవర్ టైం, సెలవులు, బస్సుల నిర్వహణ, సౌకర్యాల కొరత వంటి అంశాలపై మాట్లాడేందుకు వెళ్లిన వారిని కూర్చోవడానికి కుర్చీలు కూడా ఇవ్వకుండా కింద కూర్చోబెట్టారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

తాను మాత్రం కుర్చీలో కూర్చొని, కార్మికులను కింద కూర్చోబెట్టి మాట్లాడటం కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని జేఏసీ నేతలు అంటున్నారు. అధికారి అయినంత మాత్రాన కార్మికులను చిన్నచూపు చూడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల్లో ఆగ్రహం

"మేము సమస్యలు చెప్పుకోవడానికి వస్తే, మమ్మల్ని నేల మీద కూర్చోబెట్టి మాట్లాడటం ఏం సంస్కారం ?" అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. రోజంతా బస్సులు నడిపి, ప్రజలకు సేవ చేసే కార్మికుల పట్ల కనీస గౌరవం చూపించకపోవడం దారుణమని అంటున్నారు.

ఆర్టీసీ నడిచేది కార్మికుల శ్రమతోనే అని, అలాంటి కార్మికులను కింద కూర్చోబెట్టి మాట్లాడటం అధికార దర్పానికి నిదర్శనమని జేఏసీ నాయకులు విమర్శిస్తున్నారు. వెంటనే డిపో మేనేజర్ తీరుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, కార్మికుల గౌరవానికి భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించవద్దని ఆదేశాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.